క్లుప్తంగా

కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలి

పాలకుర్తి: గత ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించేందుకు కృషి చేయాలని మోకుదెబ్బ రాష్ట్ర కన్వీనర్ మెలుగూరి యాకయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీప్‌దాస్ మున్షీని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ ఆధ్వర్యంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ గీత సొసైటీలను రద్దు చేయడంతో గీత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యను తెలిపి పరిష్కారం చూపాలని కోరారు.

చేయూత

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన 2005–04 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తోటి స్నేహితురాలు కుటుంబానికి గురువారం ఆర్థికసాయం అందజేశారు. కట్కూర్ గ్రామానికి చెందిన పోలోజు సుజాత, మమతల తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. కాగా, తోటి స్నేహితులు రూ. 13 వేల సాయం చేశారు. అలాగే స్నేహితుడు నల్లనాగుల వెంకటాచారి రూ.5వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యం అందించారు. సాయిబాబా, నర్సింహులు, రాంబ్రహ్మం, గొడుగు కమలాకర్, నర్సింహులు, భాస్కర్, లక్ష్మీనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

‘బ్యాంకు తరలింపును ఆపాలి’

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను తరలించే యోచనను మానుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు. ఇక్క డ అద్దె భవనంలో నిర్వహిస్తున్న బ్యాంకు భవ న కాలపరిమితి ముగియడంతో వేరే భవనంలోకి మార్చాలని అధికారులు పలువురిని టెండర్‌కు పిలిచారు. ఆరుగురు సీల్డ్ కవర్ టెండర్లను వేయగా అందులో ఒకరి టెండర్ మా త్రమే ఎంపికైనట్లు తెలిసింది. కాగా, టెండర్ దక్కించుకున్న వ్యక్తి ఇచ్చే అద్దె భవనం మండల కేంద్రానికి దూరంగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఖాతా దారులు వాపోయారు. మండల కేంద్రంలోని ప్ర ధాన చౌరస్తా నుంచి కొద్ది దూరంలో బ్యాంకు ఉంటే అన్ని విధాలుగా భద్రత ఉంటుందని, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, మ హిళా సంఘాల సభ్యులకు ఉపయోగకరంగా ఉంటుందని ఖాతాదారులు, ప్రజలు కోరుతున్నారు.

పుస్తకాల పంపిణీ

కొడకండ్ల: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులకు మహాత్మా హెల్పింగ్‌హ్యాండ్స్ అధ్యక్షుడు, ఎంపీఐ గంట రవీందర్ పుస్తకాలను పంపిణీ చేశారు. రూ. 10 వేల విలువ చేసే నీట్, ఐఐటీ, జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన పుస్తకాలను ఆయన అందజేయగా గురువారం ప్రిన్సిపాల్ సునీత విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత రవీందర్‌కు అధ్యాపకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

దేవరుప్పుల: నిరుపేదల కుటుంబాల పిల్లలకు విద్యానిలయంగా మారిన పాఠశాలల అభివృద్ధి కోసం దాతల సహకారం అభినందనీయమని సర్పంచ్ ఈదునూరి రమాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని నిర్వహించే క్రీడోత్సవాల బహుమతుల కోసం ఘంటా రవీందర్ రూ.5 వేలు, స్థానిక ఉపాధ్యాయురాలు జి.సుజాతరాణి రూ.3 వేలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తోటకూరి రేణుక, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజేంద్ర కుమార్, ఉపాధ్యాయులు పి.సుకుమారి,బి.శివ ప్రసాద్, డి.సదానందం, సి హెచ్ ఆంజనేయులు, కె.రజినీ, డి శారదమ్మ, బి జైసింగ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

జఫర్‌గఢ్: మండలంలోని దుర్గ్యానాయక్‌తండాకు చెందిన బానోత్ రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు స్థానిక ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తండాకు చెందిన రాములు ఈ నెల 22న జఫర్‌గఢ్ నుంచి తండాకు బైక్‌పై వస్తుండగా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి హిమ్మత్‌నగర్‌కు మందపురి చంద్రమౌళి భార్యతో బైక్‌పై వెళ్తూ ఖాజానగండితండా వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన రాములును చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

వైద్యకళాశాలకు మృతదేహం అప్పగింత

జనగామ రూరల్ : పట్టణంలోని రాజేశ్వరీ అనాథ ఆశ్రమంలో తొట్టి లక్ష్మమ్మ మృతి చెందింది. కాగా, ఆశ్రమ నిర్వాహకులు లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో మృతదేహాన్ని వరంగల్‌లోని ది ఫాదర్ కొలంబో మెడికల్ సైన్సెస్ కళాశాలకు గురువారం అప్పగించారు. కార్యక్రమంలో డాక్టర్ నజియా, ఫాదర్ అరుణ్, కామిని శ్రీనివాస్ బాబు, ఏనుగు నర్సిరెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, బైరు వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి, దాసరి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం లాంటిది


స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ వాసం రామ్మూర్తి, అధికారులు


రఘునాథపల్లి: ర్యాలీలో తహసీల్దార్, ఎస్సై


కొడకండ్ల: ర్యాలీలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు


దేవరుప్పుల చౌరస్తాలో మానవహారం


లింగాలఘణపురంలో..


బచ్చన్నపేట: కొడవటూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని, అర్హులైన ప్రతీ ఒక్కరూ విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వాసం రామ్మూర్తి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఘన్‌పూర్ ఆర్డీఓ, స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభించిన ర్యాలీని విద్యార్థులతో కలిసి గాంధీ చౌరస్తా మీదుగా శివాజీచౌక్ వరకు నిర్వహించారు. అనంతరం మానవహారం, ఓటర్ల ప్రతిజ్ఞ చేపట్టారు. అనంతరం సీనియర్ సిటిజన్లకు, నూతన ఓటు హక్కు వచ్చిన యువతకు ఐదుగురికి రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సై నాగరాజు, డీటీ విజయ్, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్, విద్యాశాఖ మండల నోడల్ అధికారి కొమురయ్య, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, ఓటర్లచే ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ కమలాకర్, సీహెచ్.లావణ్య పాల్గొన్నారు.


పాలకుర్తి టౌన్: మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

కొడకండ్ల: ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ అంజయ్య కోరారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను తహసీల్దార్ అందజేశారు. నాయబ్ తహసీల్దార్ కోల చంద్రమోహన్, ఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు, పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ వెంకటేశం, ఎస్సై లింగారెడ్డి, డీటీ వేణు, ఆర్‌ఐ సతీష్‌చంద్ర, ఏఆర్‌ఐ రాజేష్, సర్వేయర్ విజయ్ పాల్గొన్నారు.

లింగాలఘణపురం: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హెడ్మాస్టర్ మల్లికార్జున్, ఉపాధ్యాయ బృందం, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు శ్రీధర్, పద్మ పాల్గొన్నారు.


జఫర్‌గఢ్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రఘునాథపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని, 18 ఏళ్లు నిండిన అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ పురం యుగేందర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీడీఓ హసీం, ఎస్సై రఘుపతి, ఆర్‌ఐ బలరాం పాల్గొన్నారు.

బచ్చన్నపేట: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు ప్రజల చేత ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మహిళలు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డీటీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వయోజనుల జన్మహక్కు

దేవరుప్పుల: ఓటు హక్కు వయోజనుల జన్మహక్కు అని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ హుస్సేన్ ఆధ్వర్యంలో బాలయేసు, శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించి సూర్యాపేట రహదారిపై మానవహారం చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఓటు విలువలు కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీటీసీ కృష్ణ, ఆర్‌ఐ రాజు, ప్రశాంతి విద్యానికేతన్ కరస్పాడెంటు కృష్ణ, బాలయేసు హైస్కూల్ ప్రతినిధి ఖాజా తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనాలు ప్రారంభం


నర్మెట: జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ


జఫర్‌గఢ్: జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

నర్మెట: రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే హవా కొనసాగుతుందని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ అన్నారు. మండలంలోని ఆగాపేటలో రూ. 20 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని సర్పంచ్ ముప్పిడి లక్ష్మి విజయ ప్రతాప్, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ ఎండి గౌస్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీలన్నీ నీళ్ల మూటలేనని, కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయిందని అన్నారు. ఎంపీటీసీ ఏర్పుల చైతన్యా హెబ్సేజర్, ఉపసర్పంచ్ ఆదూరి వసంత జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

తమ్మడపల్లిలో..

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ అన్నెపు పద్మ ఆశోక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నూతన జీపీ భవన నిర్మాణానికి దాత కూరపాటి రాజు స్థలాన్ని విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, ఉప సర్పంచ్ షర్ఫోద్దీన్ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

బచ్చన్నపేట: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్‌లో క్రికెట్ పోటీలను నిర్వహించారు. గురువారం ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో జనగామ, ద్వితీయ స్థానంలో లక్ష్మాపూర్ జట్లు నిలువగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నూకల మహేష్‌రెడ్డి, రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వివేక్, ఇమ్మడి లోకేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


బహుమతి ప్రదానం చేస్తున్న నాయకులు

మౌలిక వసతుల కల్పనకు కృషి

దేవరుప్పుల: మండలంలోని ఆయా గ్రామాల్లో అత్యవసర మౌలిక వసతులను గుర్తించి వాటి కల్పనకు కృషి చేద్దామని ఎంపీపీ బస్వ సావిత్రి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక నిధుల ద్వారా చేపట్టే ముందస్తు పనుల ప్రతిపాదనల స్వీకరణ కోసం ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్దేశిత నిధులతో పారిశుద్ధ్య, పాఠశాలల, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి బోర్ల మరమ్మతులు వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా గ్రామాల్లో కావాల్సిన పనుల ప్రతిపాదనలను స్వీకరించి ప్రాధాన్యత క్రమంలో నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తారన్నారు. వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీలు కవిత, రేణుక, ఉపేందర్, యాకు, రమ, కల్యాణి, మహమ్మద్ జాకీర్, మండల కోఆప్షన్ సభ్యులు మజార్, సిబ్బంది మల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ సావిత్రి

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు


జనగామ రూరల్: హైదరాబాద్‌కు తరలుతున్న నాయకులు


పాలకుర్తి నుంచి..

జనగామ రూరల్/ రఘునాథపల్లి/పాలకుర్తి/ దేవరుప్పుల: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గురువారం జరిగిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బూత్ లెవెల్ కన్వీనర్ల సమావేశానికి పలు మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. నాయకులు సర్వాల నర్సింగరావు, గంగం నరసింహారెడ్డి, బనుక శివరాజ్ యాదవ్, గోవర్ధన్ కోళ్ల రవిగౌడ్, గాదె మహేందర్‌రెడ్డి, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామిగౌడ్, పెద్ది కృష్ణమూర్తి, పేర్నె రవి, ఎండీ ఇబ్రహీంపాషా, గాదె రమేష్, కడారి చిన్ననాగేష్, పోకల శ్రీనివాస్, దొరగొల్ల గట్టయ్య, లింగారెడ్డి, మధు, పులి గణేష్, కారుపోతుల శ్రీనివాస్, రెడ్డిరాజుల రమేష్, గంగరబోయిన మల్లయ్య,దామెర అనిల్ తదితరులు ఉన్నారు.


రఘునాథపల్లి నుంచి..


దేవరుప్పుల నుంచి..

పరామర్శ



జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గబ్బెట బుచ్చయ్య తండ్రి గబ్బెట పోశయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ బృందంతో కలిసి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, సర్పంచ్ గార్లపాటి నీరాజారెడ్డి, ఉప సర్పంచ్ కన్నబోయిన కుమారస్వామి పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి

లింగాలఘణపురం/పాలకుర్తి టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గ్రాడ్యుయేట్లు ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్లు వినయలత, వెంకటేశం కోరారు. గురువారం వారు తహసీల్దార్ కార్యాలయాల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2020 నవంబర్ 1వ తేదీ వరకు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులంతా పాత, కొత్తవారంతా నమోదు చేసుకోవాలని, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే వారు ఫొటో, ఆధార్ కార్డుతో పాటు డిగ్రీ పూర్తి చేసినట్లు ప్రొవిజనల్ సర్టిఫికెట్ లేదా మెమోనైనా జత చేసి తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలని కోరారు.

ఆర్థికసాయం



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో మల్లన్న పట్నాల కోసం యాదవ సంఘానికి వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి గురువారం రూ.10వేలు సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ సంఘం పెద్దల కోరిక మేరకు తనవంతుగా ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. యాదవ సంఘం పెద్దలు తాటికొండ రమేష్, దాసరి మొండయ్య, బర్మా మల్లేశం, దాసరి కొముర‌య్య, సారయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

నర్మెట: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోపాటు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ లక్ష్మీసౌజన్య తెలిపారు. అనీమియా ముక్త్ భారత్‌లో భాగంగా రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం 44 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించగలుగుతారని అన్నారు. ఆరోగ్య సూత్రాలను పాటించాలని తెలపుతూ పలుసూచనలు, సలహాలు చేశారు. ఫార్మసిస్టు ఎనుగుల వెలంగిని, ఏఎస్‌ఎం కల్వల రజిత, హెచ్‌ఎం సామ్యూల్ ఆనంద్, ప్రజ్ఞాపురం స్వేత, శ్యామల, కల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో విద్యార్థిని ప్రతిభ


బహుమతి అందుకుంటున్న సమీర

బచ్చన్నపేట: ఓటర్లను చైతన్యం చేసే కార్యక్రమంలో భాగంగా అధికార యంత్రాంగం గత సంవత్సరం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపి బహుమతిని అందుకుందని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన పద్యరచన, పాటలు, వీధినాటకం పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కాగా, జి.సమీర పద్య రచన పోటీలో తృతీయ బహుమతి గెలుచుకుందని చెప్పారు. గురువారం కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య చేతులమీదుగా జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసపత్రంతోపాటు రూ.3వేల నగదు బహుమతిని అందుకోందని తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు సమీరను అభినందించారు.

ఆదర్శప్రాయుడు కర్పూరీ ఠాకూర్

బచ్చన్నపేట: నాయీబ్రాహ్మణుల కులంలో పుట్టిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ ఆదర్శప్రాయుడని నాయీబ్రాహ్మణ సంఘం ఐక్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి తేలుకంటి శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఠాకూర్ శత జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం నాయీబ్రాహ్మణులకు గర్వకారమని అన్నారు. ఠాకూర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

అభినందనీయం

చిల్పూరు: గ్రామాభివృద్ధిలో ప్రతీ ఒక్కరి సహకారం అభినందనీయమని సర్పంచ్ మారేపల్లి తిరుమలకృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజవరంలో గురువారం పంచాయతీ కార్యదర్శి హైమావతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ఎంపీఓ మదుసూధన్, కారోబార్ గూడూరు భాస్కర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రేపు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌లో రేపు(శనివారం) మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ధారణ సత్యప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పాఠశాలల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్టులు జరిగాయని, ఆయా పాఠశాలల నుంచి 8,9,10వ తరగతుల్లో అధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులతో కూడిన టీంలు మండల స్థాయి పోటీలకు హాజరుకావాలని ఆయన సూచించారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు ఉదయం 10.30 గంటలకు ఉంటుందని, విద్యార్థులు సకాలంలో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం 9848820367 నంబర్‌లో సంప్రదించాలని ఆయన వివరించారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని ఎల్‌పీ రిసార్ట్ పక్కన లీకవుతున్న మిషన్ భగీరథ పైపులైన్‌కు గురువారం ఏఈ ప్రజ్వల్ సిబ్బందితో మరమ్మతు పనులు చేయించారు. ఇటీవల మిషన్ భగీరథ పైప్‌ల నుంచి నీరు వృథాగా పోతుండటంతో ఎల్‌పీ రిసార్ట్‌లోకి నీరుచేరి కుంటలా తయారైంది. ఈ విషయంపై ‘వృథాగా భగీరథ నీరు’ శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పైపులను బయటకు తీసి కొత్తవాటిని అమర్చి లీకేజీలు కాకుండా మరమ్మతు పనులు చేయించారు.


పైపులైన్ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది